సాక్షి విశాఖపట్నం

బుధవారం । 20 । ఆగస్టు । 2025



సమష్టి కృషితో ఎన్ఎస్టీఎల్ అద్భుతాలు 8లో



నైపుణ్యాలతోనే ఉన్నత అవకాశాలు 8లో



నాకౌట్‌కు బుల్స్.. కింగ్స్ ఔట్ 8లో

న్యూస్‌రీల్

పెరిగిన మేహాద్రి నీటిమట్టం!

ప్రస్తుతం 55.3 అడుగులకు **చేరిక**



మంగళవారం సాయంత్రం నాటికి మేహాద్రి నీటిమట్టం

పెందుర్తి: నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో మేహాద్రి రిజర్వాయర్ నిండుకుండలా మారింది. ఏజెన్సీ, మైదాన ప్రాంతాల నుంచి వర్షపు నీరు ఉధృతంగా వస్తుండటంతో గంటగంటకు మేహాద్రి నీటిమట్టం పెరుగుతోంది. మంగళవారం సాయంత్రానికి అది 55.3/61 అడుగులకు చేరుకుంది. వారం రోజుల కిందట వరకు దాదాపుగా ఎండిపోయిన మేహాద్రి.. కేవలం నాలుగు రోజుల్లోనే రికార్డు స్థాయిలో నిండిపోవడం గమనార్హం. మరో మూడు అడుగుల నీటిమట్టం పెరిగితే ఉన్నతాధికారుల సూచనల మేరకు ఒక గేటు ఎత్తే అవకాశాలు ఉన్నట్లు నీటి పారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు తెలిపారు. ఇప్పటికే మేహాద్రి పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు.

అప్పన్నకు వెండి తీర్థం గిన్నె బహూకరణ



వెండి తీర్థం గిన్నెను డిప్యూటీ ఈవో, ఏఈవోలకు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం అక్కయ్యపాలెం లలితానగర్‌కి చెందిన ఎం.వై.సుబ్రహ్మణ్యం ఒక కిలో 264 మిల్లీ గ్రాముల వెండి తీర్థం గిన్నెను బహూకరించారు. ఆలయ డిప్యూటీ ఈవో రాధ, ఏఈవో తిరుమలేశ్వరరావుకు ఆయన గిన్నెను అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామి దర్శనం కల్పించి, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తులు, సిబ్బంది సాంబ, నాయుడు పాల్గొన్నారు.

వచ్చేనెల 13న లోక్ అదాలత్

విశాఖ-లీగల్ : వచ్చే నెల 13న జరగనున్న లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు సహకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు న్యాయవాదులకు సూచించారు. మంగళవారం న్యాయ సేవా సదన్‌లోని తన కార్యాలయంలో న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంలో లోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి, కక్షిదారులకు లోక్ అదాలత్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని న్యాయవాదులకు తెలిపారు. సమావేశంలో బీమా సంస్థల అధికారులు, స్టాండింగ్ కౌన్సిల్స్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

22న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం



డాబాగార్డెన్స్: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ఈ నెల 22న నిర్వహించనున్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశంలో 84 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి. వీటిలో పలు అభివృద్ధి పనులతో పాటు వివిధ విభాగాలకు సంబంధించి సర్వీస్ అంశాలు, రెవెన్యూ అంశాలు చర్చకు రానున్నాయి. జీవీఎంసీ పరిధిలో ఉన్న పలు బీచ్‌ల్లో 20 మంది అదనపు బీచ్ లైఫ్‌గార్డ్స్ నియామకం, 15వ ఆర్థిక సంఘం గ్రాంటులోని తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, శానిటేషన్ కోసం 2021-22 ఏడాదికి సవరించిన వార్షిక అభివృద్ధి ప్రణాళిక ఆమోదం, జోన్-1 పరిధి 2వ వార్డులో రూ.కోటి 70 లక్షలతో బీటీ రోడ్డు విస్తరణ, జోన్-2 పరిధి ఎండాడలో రూ.89 లక్షలతో బీటీ రోడ్డు, జోన్-4 పరిధి 32వ వార్డు సౌత్‌జైల్ రోడ్డు అంబేడ్కర్ సర్కిల్ నుంచి రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఎదురుగా ఉన్న ఐల్యాండ్ వరకు రూ.కోటి 45 లక్షలతో బీటీ రోడ్డు పునరుద్ధరణ, అలాగే భీమిలి, గాజువాక, జోన్-3, జోన్-4, జోన్-5 పరిధిలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి.

కళ్లు మూసుకుంటాం... కట్టేసుకోండి

- అనుమతి లేకుండానే సెల్లార్ నిర్మాణం
- 3 అంతస్తుల అనుమతికి 7 అంతస్తుల నిర్మాణాలు
- 10 అడుగుల రోడ్డులో 5 ఫ్లోర్లు...
- చక్రం తిప్పుతున్న కార్పొరేషన్ చైర్మన్ పీఏ
- నేరుగా జీవీఎంసీ అధికారులకు ఫోన్లు
- సహకరిస్తున్న ఓ ఏసీపీ



ఈ ఫొటోలో ఉన్నది విశాలాక్షినగర్‌లో ఫారెస్ట్ బంగ్లాకు వెళుతున్న దారిలోని నిర్మాణం. ఇక్కడ ఏకంగా సెల్లార్ నిర్మాణంతో పాటు జీ ప్లస్ 6 ఫ్లోర్లు నిర్మిస్తున్నారు. జీవీఎంసీ నుంచి అధికారికంగా జీ ప్లస్ 3కు మాత్రమే అనుమతి తీసుకున్నారు. అదనంగా మరో మూడు ఫ్లోర్లను నిర్మిస్తున్నారు. అంతేకాకుండా ఏకంగా సెల్లార్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు.



ఈ ఫొటోలో ఉన్నది కేవలం 10 అడుగుల రోడ్డులో చేపడుతున్న నిర్మాణం. ఇక్కడ భారీ నిర్మాణం చేపట్టకూడదు. అయితే, ఏకంగా 5 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సమీపంలో, జోనల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో జరుగుతున్న తంతును కనీసం పట్టించుకోవడం లేదు.



ఇది ఎంఎంటీఎస్ కాలనీలోని ఒక భవనం. ఇప్పటికే అదనపు అంతస్తును నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారంటూ శ్లాబుకు 5,6 దఫాలుగా రంధ్రం పెట్టేశారు. ఇప్పుడు కూటమి నేత నుంచి తీసుకున్న అనుమతితో అదనపు అంతస్తు నిర్మాణాన్ని గుట్టుచప్పుడు కాకుండా చేపడుతున్నారు.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఇవే కాదు అధికారపార్టీకి చెందిన ఒక కార్పొరేషన్ చైర్మన్ పీఏ పేరుతో రెచ్చిపోతున్న బిల్డర్లకు సంబంధించిన వ్యవహారం ఇది. ఒక్కో అనధికార అక్రమ కట్టడానికి సదరు కార్పొరేషన్ చైర్మన్ పీఏకు రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల చొప్పున ముట్టచెబుతున్నారని తెలుస్తోంది. దక్షిణ నియోజకవర్గానికి చెందిన సదరు కార్పొరేషన్ పీఏ పేరుతో నేరుగా జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగానికి చెందిన అధికారులకు ఫోన్లు వెళుతుండటంతో మిన్నకుండిపోతున్నారని సమాచారం. అంతేకాకుండా జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగానికి చెందిన ఏసీపీ కూడా ఒకరు ఇందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా జరిగిన బదిలీల్లో మారిన సదరు ఏసీపీ వసూళ్లకు కేరాఫ్ అడ్రస్ అనే పేరు ఉంది.

కార్పొరేషన్ చైర్మన్ పీఏ పేరుతో.. : వాస్తవానికి జీవీఎంసీ పరిధిలో ప్రధానంగా అక్రమ నిర్మాణాలను కార్పొరేషన్ పీఏ అండగా నిలుస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఎవరైనా బిల్డర్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని తెలిస్తే వెంటనే సదరు పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల ద్వారా పిలిపించుకుని వసూళ్లకు తెగబడుతున్నట్టు సమాచారం. ఇక ఎవరైనా నేరుగా అతనిని కలిసి అక్రమ నిర్మాణాలకు సహకరించమని కోరినా... వెంటనే రంగంలోకి దిగుతున్నట్టు తెలుస్తోంది. సదరు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఫోన్ చేసి... ఫలానా అక్రమ నిర్మాణం జోలికి వెళ్లవద్దంటూ ఆదేశాలు జారీచేస్తున్నారు. ఇందుకోసం ఒక్కో అక్రమ నిర్మాణానికి రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకూ వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో సదరు కార్పొరేషన్ చైర్మన్ పీఏకు ఒక ఏసీపీ ప్రధానంగా సహకరిస్తున్నారనే విమర్శలున్నాయి.

ఏసీపీ వసూళ్ల దందా...

ప్రధానంగా ఎంఎంటీఎస్ కాలనీలో చేపడుతున్న అదనపు అంతస్తు నిర్మాణాన్ని ఇప్పటికే పలు దఫాలుగా జీవీఎంసీ అధికారులు శ్లాబుకు రంధ్రం చేసి వదిలిపెట్టారు. మరోవైపు తాజాగా గోడల నిర్మాణాన్ని సదరు బిల్డర్ చేపడుతున్నారు. కార్పొరేషన్ పీఏ నుంచి ఫోన్ వచ్చిన తర్వాత ఈ వ్యవహారంలో చూసీచూడనట్టుగా ఏసీపీ సహకరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికే భారీగా అక్రమ నిర్మాణాలకు సహకరిస్తూ భారీగా ఆర్జించారనే విమర్శలు సదరు ఏసీపీపై ఉన్నాయి. తన పరిధిలో ఎక్కడ అక్రమ నిర్మాణం జరిగినా వెంటనే భారీగా వసూళ్లకు తెగబడుతూ భారీ భవనాన్ని సొంతానికి సదరు ఏసీపీ నిర్మించుకున్నారనే విమర్శలున్నాయి. అంతేకాకుండా తనకు సంబంధం లేని ప్రాంతంలోని అక్రమ నిర్మాణాల విషయంలోనూ ఏసీపీ జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

దివ్యాంగుల పింఛన్లపై కక్ష



కేజీహెచ్‌లో సదరం సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్ కోసం వచ్చిన అర్థోపెడిక్ దివ్యాంగులు



కేజీహెచ్‌లో సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తును పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ ఉద్యోగి

- రీ వెరిఫికేషన్ పేరుతో భారీగా పింఛన్ల ఏరివేత
- 40 శాతంలోపు ఉన్న వారికి నోటీసులు
- జిల్లాలో 1178 మందికి పింఛను నిలిపివేత
- ఆందోళనలో దివ్యాంగులు
- కూటమికి వ్యతిరేకంగా 25న ఆందోళన

జిల్లాలో మొత్తం దివ్యాంగుల పింఛనుదారులు	21,306
రీ-వెరిఫికేషన్ పూర్తయినవారు	16,187
రీ-వెరిఫికేషన్ చేయాల్సినవారు	5,119
నోటీసులు అందుకున్నవారు	1,178

జిల్లాలో 1,178 మందికి నోటీసులు

జిల్లాలో మొత్తం 21,306 మంది దివ్యాంగులు పింఛన్లు పొందుతున్నారు. వీరిలో ఇప్పటివరకు 16,187 మందికి రీ-వెరిఫికేషన్ పూర్తయింది. ఈ ప్రక్రియలో 1,178 మంది దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల ప్రకారం 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్నట్లు తేలింది. దీంతో వారికి పింఛన్లు నిలిపివేస్తున్నట్లు సచివాలయ ఉద్యోగుల ద్వారా నోటీసులు జారీ చేస్తున్నారు.

మహారాణిపేట: ఎన్టీఆర్ భరోసా దివ్యాంగుల పింఛనుదారులపై కూటమి సర్కార్ కక్ష కట్టింది. ఎలాగైనా దివ్యాంగుల పింఛన్లు తగ్గించడానికి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా 40 శాతంలోపు ఉన్న దివ్యాంగ పింఛనుదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. వచ్చే నెల నుంచి వీరికి పింఛన్ నిలుపుదల చేస్తున్నారు. ఇప్పటికే పింఛన్లు తీసుకునే లబ్ధిదారుల సంఖ్యను తగ్గించడానికి ర్యాండమ్ సర్వే చేశారు.ఆ తర్వాత మంచం మీద ఉండే దివ్యాంగులకు నోటీసులు ఇచ్చి ఇళ్లకు వెళ్లి సదరం సర్టిఫికెట్స్ రీ వెరిఫికేషన్ చేశారు. అలాగే ఇతర ప్రాంతాల వైద్యుల చేత సదరం సర్టిఫికెట్లను ఆస్పత్రుల్లో రీ వెరిఫికేషన్ చేస్తున్నారు.ఇప్పటి వరకు కంటి దివ్యాంగుల,ఈఎన్టీ దివ్యాంగులు, మానసిక దివ్యాంగులు సదరం సర్టిఫికేట్స్ రీ వెరిఫికేషన్ జరిగింది. ఇప్పుడు అర్థోపెడిక్ దివ్యాంగుల సదరం సర్టిఫికేట్స్ రీ వెరిఫికేషన్ జరుగుతోంది.

దివ్యాంగుల ఆవేదన

ఎన్నికల సమయంలో పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు లబ్ధిదారుల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేయడంపై దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వివిధ రకాల ఇబ్బందులతో బాధపడుతున్న తమకు, ఈ రీ-వెరిఫికేషన్ ప్రక్రియ మరింత భయాన్ని కలిగిస్తోందని వారు పేర్కొంటున్నారు. రీ-వెరిఫికేషన్‌లో సర్టిఫికెట్లు రద్దైతే తమ పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం రూ.10,000 పింఛను పొందుతున్న దివ్యాంగులకు కూడా నోటీసులు జారీ చేయడంతో వారిలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.

25న దివ్యాంగులతో ర్యాలీ

జిల్లాలో 1178 మంది దివ్యాంగుల పింఛన్లు నిలిచిపోవడంతో ఈనెల 25న వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు అక్కిరెడ్డి అప్పారావు తెలిపారు. సమావేశం అనంతరం ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటామని,అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని అప్పారావు వివరించారు. దివ్యాంగులకు న్యాయం చేయాలని, పింఛన్లు రద్దు చేయడం అన్యాయని,దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని అప్పారావు కోరారు.

రౌడీ షీటర్ల ఇళ్లల్లో మారణాయుధాలు

- గంజాయితో పాటు రూ.6 లక్షలు, బంగారు ఆభరణాలు స్వాధీనం
- నగరంలో కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం, కత్తులు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

విశాఖ సిటీ: నగరంలో అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్న వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో నాటు తుపాకీ వ్యవహారం కలకలం రేపడంతో అన్ని ప్రాంతాలను జల్లెడ పట్టారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నగరంలో ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల ఇళ్లలో మంగళవారం తెల్లవారుజాము నుంచి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జోన్-1, జోన్-2, క్రైమ్ విభాగంతో కలిపి మొత్తం 525 మంది అధికారులు సిబ్బందితో 103 బృందాలు ఏర్పడ్డారు. ప్రతి టీమ్ బాడీ వార్న్, మొబైల్ కెమెరాలను వినియోగిస్తూ సుమారు 500 మంది రౌడీ/సస్పెక్ట్ షీటర్ల ఇళ్లను తనిఖీలు చేశారు. ఇందులో మహిళా కానిస్టేబుళ్లు, హోమ్‌గార్డులు కూడా పాల్గొని ఇళ్లను పరిశీలించారు. వాహనాల రికార్డులు, అనుమానాస్పద వ్యక్తులు, మారణాయుధాలను గుర్తించారు. జోన్-1 పరిధిలో భీమిలిలో రెండు కత్తులను, ఎంవీపీ పరిధిలో ఒక ఇంట్లో కత్తి, 2 కేజీల గంజాయి, మరో ఇంట్లో సరైన లెక్కలు లేని రూ.6 లక్షల నగదు, 11 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే జోన్-2లో కంచరపాలెం పరిధిలో 2.5 కేజీ గంజాయి, గోపాలపట్నం పరిధిలో 11 క్వార్టర్ మద్యం బాటిళ్లు సీజ్ చేశారు. క్రైమ్ అధికారులు, సిబ్బంది సస్పెక్ట్ షీటర్ల ఇళ్లలో నిర్వహించిన తనిఖీల్లో మూడో పట్టణ పరిధిలో చోరీకి గురైన 4 మొబైల్ ఫోన్లు, ఫోర్త్‌టౌన్ పరిధిలో రెండు హ్యాండ్ గ్లవ్స్, గోపాలపట్నం పరిధిలో ఒక సస్పెక్ట్ షీటర్ ఇంట్లో ఒక వ్యక్తి గంజాయి సేవిస్తూ పట్టుబడ్డాడు. వీరిపై కేసులు నమోదు చేశారు.

నేటి నుంచి 24 వరకు కోర్టు ఉద్యోగాలకు పరీక్షలు

విశాఖ-లీగల్ : జిల్లాలోని న్యాయస్థానాలలో వివిధ ఉద్యోగాల నియామకాలకు బుధవారం నుంచి 24వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో మీడియాతో ఈ వివరాలు వెల్లడించారు. స్టెనోగ్రాఫర్- ఐఐఐ, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఫీల్డ్ అసిస్టెంట్, ఎగ్జామినర్, కాపీయిస్ట్, డ్రైవర్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు ఈ పరీక్షలు జరుగుతాయని, రోజుకు మూడు షిఫ్టుల్లో కంప్యూటర్ ద్వారా పరీక్షలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందే కేంద్రాలకు చేరుకోవాలని, గేట్లు మూసిన తర్వాత ఎవరినీ అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. హాల్ టికెట్‌తో పాటు ఐడీ ప్రూఫ్‌ను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే 0863-237252 నంబర్‌కు లేదా helpdesk-hc.ap.aij.gov.in మెయిల్‌కు సంప్రదించాలని తెలిపారు. పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు తర్వాత స్కిల్ టెస్ట్ ఉంటుందని, దివ్యాంగులు లేదా మెడికల్ ఎమర్జెన్సీ ఉన్నవారికి అభ్యర్థన మేరకు స్క్రైబ్‌ను ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. నిబంధనల ప్రకారమే పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలకు, పుకార్లకు లొంగవద్దని ఆయన సూచించారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు రష్యాలో ఉద్యోగావకాశాలు



ప్రభుత్వ పాలిటెక్నిక్‌ను సందర్శించిన రష్యన్ ప్రతినిధుల బృందం

మురళీనగర్: విశాఖలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులకు రష్యాలో నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని రష్యన్ ప్రతినిధుల బృందం తెలిపింది. భారత్-రష్యాల మధ్య సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధిపై కుదిరిన ఒప్పందంలో భాగంగా 12 మంది సభ్యుల రష్యన్ బృందం మంగళవారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించింది. ఈ బృందం మెటలర్జికల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ప్రయోగశాలలను పరిశీలించింది. ఏపీలో డిప్లొమా స్థాయి విద్యలో అనుసరిస్తున్న పాఠ్యప్రణాళిక, బోధనా పద్ధతులను వారు అధ్యయనం చేశారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల గురించి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రత్నకుమార్ వారికి వివరించారు. రష్యాలో పాలిటెక్నిక్ విద్యార్థులకు శిక్షణ, ఉద్యోగాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రతినిధులు తెలిపారు. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య సాంకేతిక, విద్యా సంబంధాలు మరింత బలపడతాయని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ పీఎం. బాషా, ఫార్మసీ హెడ్ జీ. గోవర్ధన్ రావు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

22న కానిస్టేబుల్ అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాల్లో ఇటీవల కానిస్టేబుల్ (సివిల్, ఏపీఎస్పీ) ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 22న సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఈ విషయాన్ని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన విశాఖలోని విశాలాక్షి నగర్, కైలాసగిరిలో ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ గ్రౌండ్‌లో జరుగుతుంది. అభ్యర్థులు ఉదయం 7 గంటల కల్లా అక్కడకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఎంపిక ప్రక్రియ సమయంలో సమర్పించిన జిరాక్స్ కాపీలకు సంబంధించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఆయన కోరారు.

వణికిస్తున్న జ్వరాలు

- పెరుగుతున్న మలేరియా, డెంగ్యూ కేసులు
- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 89 మందికి మలేరియా, 153 మందికి డెంగ్యూ
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో విచ్చలవిడిగా వసూళ్లు



కేజీహెచ్‌లో జ్వరపీడితులు

నగరంలో అనూహ్యంగా పెరుగుతున్న జ్వరాలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇదివరకూ కేవలం గిరిజన ప్రాంతాలకే పరిమితమైన మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ఇప్పుడు నగర ప్రాంతాల్లోనూ విపరీతంగా వ్యాపిస్తున్నా యి. అడపాదడపా కురుస్తున్న వర్షాలు, పారిశుద్ధ్య లోపం, మరియు పేరుకుపోతున్న చెత్తాచెదారం కారణంగా దోమలు విపరీతంగా పెరిగి, ఈ జ్వరాల వ్యాప్తికి కారణమవుతున్నాయి. – మహారాణిపేట

సాధారణంగా జూలై-అక్టోబర్ మధ్య జ్వరాలు ఎక్కువగా వస్తాయి. కానీ ఈసారి ఎండలు ఉన్నప్పటికీ వర్షాలు పడుతుండటంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. నగరంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, మురికి కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, మరియు పొంగి ప్రవహిస్తున్న భూగర్భ డ్రైనేజీలు కనిపిస్తున్నాయి. మురుగు కాలువల్లో పూడికలు తీయకపోవడంతో దోమల సంఖ్య భారీగా పెరిగి, ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారింది. అయితే, దోమల నియంత్రణకు అవసరమైన ఫాగింగ్ యంత్రాలు మూలకు చేరడం గమనార్హం.

డెంగ్యూ, మలేరియా కేసులు పెరుగుదల

దోమల వల్ల వచ్చే డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి జ్వరాలు ఇప్పుడు నగరవాసులను వెంటాడుతున్నాయి. డెంగ్యూ సాధారణంగా పగటిపూట కుట్టే దోమల వల్ల వ్యాపిస్తుంది. ఇది సాధారణ జ్వరంలా మొదలైనా, ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు అధికారిక గణాంకాల ప్రకారం, డెంగ్యూ, మలేరియా కేసులు భారీగా నమోదయ్యాయి. జిల్లాలో 4,399 మందికి డెంగ్యూ రక్త పరీక్షలు చేయగా, 153 కేసులు నిర్ధారణ అయ్యాయి. మలేరియా కోసం 1,28,799 మందికి పరీక్షలు చేయగా, 89 కేసులు నమోదయ్యాయి. అయితే, ఇవి కేవలం అధికారిక లెక్కలు మాత్రమేనని, అనధికారికంగా కేసుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిట

పెరుగుతున్న జ్వరాల కారణంగా ప్రభుత్వ ఆసుపత్రులైన కేజీహెచ్, విమ్స్, అలాగే ప్రైవేటు క్లినిక్‌లు, ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. కేజీహెచ్‌లోని భావనగర్ వార్డులో డెంగ్యూ, మలేరియా బాధితులకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. రోజుకు సుమారు 10 నుంచి 20 మంది జ్వర బాధితులు ఓపీకి వస్తున్నారు. విమ్స్‌లో రోజుకు 15 నుంచి 20 మంది ఓపీకి వస్తుండగా, వీరిలో 5 నుంచి 8 మంది డెంగ్యూ బాధితులే ఉన్నారు.

డెంగ్యూ పేరుతో ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ

ప్రైవేటు ఆసుపత్రులు ఈ పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్నాయి. డెంగ్యూ బాధితుల నుంచి భారీగా బిల్లులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 'ప్లేట్‌లెట్స్ తగ్గితే ప్రాణానికే ప్రమాదం' అంటూ రోగులను భయపెట్టి, ఒక్కో కేసు నుంచి రూ.60,000 నుంచి రూ.1 లక్ష వరకు వసూలు చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. రక్తం ఎక్కించాల్సిన అవసరం వస్తే బిల్లులు ఇంకా పెరుగుతున్నాయి.

రూ.60 వేలు ఖర్చు చేశా..

నా కుటుంబమంతా ప్రసాద్ గార్డెన్స్‌లో జీవిస్తున్నాం. నలుగురులో ఇద్దరికి జ్వరం వచ్చింది. నేను స్థానికంగా ఉన్న ప్రసాద్‌గార్డెన్స్ యూపీహెచ్‌సీలో వైద్యుడ్ని సంప్రదించాను. రక్త పరీక్షలు చేశారు. ఈ పరీక్షల్లో డెంగ్యూగా నిర్ధారణ అయింది. జ్వరం తగ్గకపోవడంతో నగరంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరా. కొద్ది రోజుల తర్వాత జ్వరం అదుపులోకి వచ్చింది. కాని దాదాపు రూ.60 వేలు పైబడి బిల్లు వేశారు. పేద కుటుంబంలో జన్మించిన నాకు రూ.60 వేలు చెల్లించడం కష్టంగా మారింది. అప్పులు చేసి ఆస్పత్రి ఫీజు చెల్లించాల్సి వచ్చింది.

– నాయిని లక్ష్మి, ప్రసాద్‌గార్డెన్స్,పూర్ణామార్కెట్

జ్వరంతో ఇబ్బంది పడుతున్నా..

నా కుటుంబం ఎగురెల్లి వీధి,కొడిపందెల వీధిలో ఉంటున్నాం. నేను,నా భర్త చిన్నచిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ప్రతి రోజూ సాయంత్రం సమయంలో చలి జ్వరం వస్తోంది. రెండు రోజులు ఇంటి వద్దే ఉన్నాను. పనికి వెళ్లక పోతే కుటుంబ పోషణ జరగడం కష్టంగా ఉంది. జ్వరం అదుపులోకి రాలేదు. జబ్బరితోటలో ఉన్న యూపీహెచ్‌సీలో వైద్యున్ని సంప్రదించా.. చలి జ్వరం కావడంతో మలేరియా పరీక్షలు చేయగా.. మలేరియాగా నిర్ధారణ అయింది.

– దళమంతుల రామలక్ష్మి, ఎగువ రెల్లివీధి, కోడిపందెల వీధి, 30వ వార్డు

కురసాల సత్యనారాయణకు నివాళులు



సత్యనారాయణ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

విశాఖ సిటీ: వైఎస్సార్‌ సీపీ రీజినల్‌ కోఆర్డినేటర్‌, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తండ్రి కురసాల సత్యనారాయణ మంగళవారం కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు కాకినాడలోని కన్నబాబు నివాసానికి చేరుకుని సత్యనారాయణ పార్థివదేహానికి నివాళులర్పించారు. కేకే రాజుతో పాటు మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ సమన్వయకర్తలు తిప్పల దేవన్‌రెడ్డి, మొల్లి అప్పారావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు జీలకర్ర నాగేంద్ర తదితరులు కన్నబాబును పరామర్శించారు.

హెచ్‌సీఎల్‌ ‘టెక్‌బీ’ ప్రారంభం

ఏయూక్యాంపస్‌: కళాశాల విద్యార్థులు తమ టెక్నాలజీ ప్రయాణాన్ని ప్రారంభించడానికి వీలుగా హెచ్‌సీఎల్‌ టెక్నాలజీస్‌ సంస్థ ఆధ్వర్యంలో ‘టెక్‌బీ’ తీసుకొచ్చినట్లు ఆ సంస్థ సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ బి.సుబ్రమణియన్‌ తెలిపారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, వివరాలు వెల్లడించారు. పాఠశాల, ఇంటర్మీడియట్‌ విద్యను పూర్తిచేసుకున్న విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. ప్రముఖ విద్యాసంస్థల సహకారంతో ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ (ఏఐ), సైబర్‌ సెక్యూరిటీ వంటి అత్యాధునిక కోర్సుల్లో శిక్షణ ఇస్తామని వివరించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నైపుణ్యాలను అందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని చెప్పారు. ఈ శిక్షణకు ఎంపికైన వారికి స్టైఫండ్‌ అందిస్తామని, పూర్తి వివరాలను https:// www.hcltechbee.com/ ను సందర్శించవచ్చని పేర్కొన్నారు.

దేవుడి పేరుతో వ్యాపారం చేయొద్దు

- వినాయక దర్శనాలకు టికెట్లు వద్దు
- మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి
- అన్ని శాఖల అధికారులు, మండపాల నిర్వాహకులతో సీపీ సమావేశం



నిర్వాహకులకు సూచనలిస్తున్న సీపీ బాగ్చీ

విశాఖ సిటీ: వినాయక మండపాల్లో దర్శనానికి టికెట్లు ఏర్పాటు చేయకూడదని నగర పోలీస్‌ కమిషనర్‌ డాక్టర్‌ శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు. మంగళవారం పోలీస్‌ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో పాటు వినాయక మండపాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు దరఖాస్తు చేస్తే, అంతే వేగంగా అనుమతులు మంజూరు అవుతాయన్నారు. ఎంత ఖర్చు చేసినప్పటికీ.. దేవుడి పేరుతో వ్యాపారం చేయకూడదని స్పష్టం చేశారు. దర్శనాలకు టికెట్లు, పార్కింగ్‌ చార్జీలు, చీరలు, నగదు వసూలు చేయకూడదని తేల్చి చెప్పారు. ఈ ఏడాది నుంచి డ్రోన్‌లతో నిఘా పెట్టి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

భద్రతా చర్యలు–మార్గదర్శకాలు

- మండపాల నిర్వాహకులు విద్యుత్‌ పనులు ప్రారంభించే ముందు లోపల, బయట కరెంట్‌ తీగలను పరిశీలించాలి. కరెంట్‌ తీగలు మండపానికి తాకకుండా జాగ్రత్త పడాలి.
- షార్ట్‌ సర్క్యూట్‌ అవకుండా అధిక వేడి ఉత్పత్తి చేసే బల్బులు, కవర్‌ లేని హాలోజన్‌ ల్యాంప్స్‌ వాడకూడదు.
- ఊరేగింపులు, నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో సరైన బారికేడింగ్‌, లైటింగ్‌, పబ్లిక్‌ అడ్రస్‌ సిస్టమ్‌, సీసీ కెమెరాలు, జనరేటర్లు ఏర్పాటు చేయాలి.
- విగ్రహాల నిమజ్జనం అధికారికంగా గుర్తించిన ప్రదేశాల్లో మాత్రమే జరగాలి.
- మండపాల్లో పేలుడు పదార్థాలు ఉంచకూడదు. నూనె దీపాలు వెలిగించేటప్పుడు అత్యంత జాగ్రత్త అవసరం.
- మండపాల సమీపంలో అగ్ని ప్రమాదానికి కారణమయ్యే పదార్థాలను ఉంచకూడదు. నీరు, ఇసుక తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలి.
- నిమజ్జన ఊరేగింపుల్లో బాణసంచా వాడకూడదు.
- లౌడ్‌స్పీకర్లు, మైకుల వినియోగంపై పరిమితులు ఉండాలి. కాలుష్య నియంత్రణ మండలి నిర్ణయించిన డెసిబెల్‌ పరిమితిని అతిక్రమించకూడదు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మైకులు వినియోగించకూడదు.
- మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలి. పీవోపీ విగ్రహాల వాడకాన్ని నిరోధించేందుకు పాఠశాలలు, కళాశాలల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.
- నిమజ్జన ప్రాంతాల్లో తగినంత మంది ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలి.
- మండపాల్లో కనీసం ముగ్గురు వలంటీర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలి. వారి ఫోన్‌ నంబర్లు స్థానిక పోలీస్‌ స్టేషన్‌కు ఇవ్వాలి.
- అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలి. భక్తులు తెచ్చే పెద్ద బ్యాగులు, సూట్‌ కేసులు, పార్సిల్స్‌ను అనుమతించకూడదు.
- డీజే సిస్టమ్‌లు మండపాల్లోనూ, ఊరేగింపుల్లోనూ వినియోగించకూడదు.
- మండపాల్లో జూదం, మత్తు పదార్థాల వినియోగం పూర్తిగా నిషేధం. కమిటీ సభ్యులు దీనిపై బాధ్యత వహించాలి.
- మండపాల్లో సీసీటీవీలు ఏర్పాటు చేసి, 24 గంటల ఫుటేజ్‌ రికార్డ్‌ చేసి పర్యవేక్షించాలి.
- సోషల్‌ మీడియా, వాట్సాప్‌ ద్వారా వచ్చే పుకార్లను నమ్మకూడదు, ఫార్వర్డ్‌ చేయకూడదు. ఇలాంటివి వస్తే వెంటనే వాట్సాప్‌ నంబర్‌ 7995 095799 లేదా 100/112కు కాల్‌ చేయాలి.
- బలవంతంగా విరాళాలు వసూలు చేయకూడదు. లక్కీ డిప్స్‌, లాటరీలు నిర్వహించకూడదు.

గల్లంతైన యువకుడు.. కరువైన ప్రభుత్వ సాయం

సొంత ఖర్చులతోనే
సతీష్‌ ఆచూకీ కోసం గాలింపు



తీరం వద్ద మత్స్యకారుల ఎదురుచూపులు

ఎంవీపీకాలనీ: సముద్రంలో కొట్టుకుపోయిన అప్పుఘర్‌ ప్రాంతానికి చెందిన పిల్లా సతీష్‌ (24) అనే మత్స్యకార యువకుడి ఆచూకీ మూడు రోజులైనా లభ్యం కాలేదు. ఆదివారం ఉదయం లాసన్స్‌ బే కాలనీ గెడ్డ వద్ద గేలంతో చేపలు పడుతుండగా, నీటి ప్రవాహం ఉధృతం కావడంతో ఆయన గెడ్డలోకి ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. అనంతరం సముద్రంలోకి కొట్టుకుపోయాడు. ప్రమాదం జరిగిన నాటి నుంచి ప్రభుత్వ యంత్రాంగం ఎలాంటి సహాయం చేయలేదని, తామే సొంత ఖర్చులతో గాలింపు చర్యలు చేపడుతున్నామని సతీష్‌ కుటుంబ సభ్యులు, తోటి మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ‘మా తమ్ముడి మృతదేహం కోసమైనా.. అప్పులు చేసి నాలుగు పడవల్లో డీజిల్‌ కొట్టించుకుని వెతుకుతున్నాం’ అని సతీష్‌ అన్నయ్య పిల్లా ఎల్లాజీ కన్నీటిపర్యంతమయ్యారు. ఘటనపై పోలీసులకు, మత్స్యకార శాఖకు సమాచారం ఇచ్చినా, వారు కేవలం కేసు నమోదుకే పరిమితమయ్యారని జాలరి ఎండాడకు చెందిన మత్స్యకారులు ఆరోపించారు. ప్రభుత్వ తీరుపై సంఘటన జరిగిన స్థలంలో మంగళవారం నిరసన తెలిపారు. జిల్లా యంత్రాంగం గానీ, స్థానిక ఎమ్మెల్యే కానీ, ఈ ప్రాంతానికి కూతవేటు దూరంలో ఉంటున్న హోం మంత్రి గానీ కనీసం సతీష్‌ కుటుంబాన్ని పరామర్శించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక పేదవాడికి జరిగిన అన్యాయంపై ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యమా? ఇదే ఒక ధనిక వ్యక్తికి జరిగివుంటే ఇలాగే వ్యవహరించేవారా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



సతీష్‌ కోసం వెతుకులాట

నైపుణ్యాలతోనే ఉన్నత అవకాశాలు

మురళీనగర్‌: పాలిటెక్నిక్‌ డిప్లొమా విద్యార్థులు తమ సబ్జెక్టులపై పట్టు సాధించడంతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని గవర్నమెంట్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ కెమికల్‌ ఇంజినీరింగ్‌, కంచరపాలెం ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.వెంకటరమణ అన్నారు. ఇన్ఫోసిస్‌ సౌజన్యంతో ఉన్నతి ఫౌండేషన్‌ నిర్వహించిన వీఎస్‌ఎస్టీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ‘వాలిడేషన్‌ ప్రోగ్రామ్‌’ మంగళవారం కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘లెర్న్‌ – ఎర్న్‌ – స్టాండ్‌ టాల్‌’ అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం విద్యార్థుల ఉపాధి నైపుణ్యాలు, కమ్యూనికేషన్‌ స్కిల్స్‌, జీవన నైపుణ్యాలను మెరుగుపరచడంలో ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఉన్నతి ఫౌండేషన్‌ ట్రైనర్‌ కె.కనకరాజు విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, కమ్యూనికేషన్‌ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నైపుణ్యాల ప్రాధాన్యతను ఆయన వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు తమ నైపుణ్యాలను రోల్‌ ప్లే, ప్రసంగాల ద్వారా ప్రదర్శించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో కెమికల్‌ హెడ్‌ ఎం.మహాలక్ష్మి, సీనియర్‌ లెక్చరర్‌ డాక్టర్‌ ఎం.విజయలక్ష్మి, లెక్చరర్‌ ఎల్‌.గీతిక సహకరించారు.

సమష్టి కృషితో ఎన్‌ఎస్టీఎల్‌ అద్భుతాలు

డీఆర్‌డీవో ఛైర్మన్‌ డాక్టర్‌ సమీర్‌ వి.కామత్‌

గోపాలపట్నం: శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, విద్యాసంస్థలు, నేవీ అధికారుల సమష్టి కృషితో ఎన్‌ఎస్టీఎల్‌ అద్భుతాలను సృష్టిస్తోందని డీడీ ఆర్‌ అండ్‌ డీ కార్యదర్శి, డీఆర్‌డీవో ఛైర్మన్‌ డాక్టర్‌ సమీర్‌ వి.కామత్‌ అన్నారు. మంగళవారం ఎన్‌ఎస్టీఎల్‌ 56వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశాన్ని రక్షణ రంగంలో సాధికారత వైపు నడిపించడంలో ఎన్‌ఎస్టీఎల్‌ 56 ఏళ్ల ప్రయాణం ఎంతో కీలకమన్నారు. ఈ ప్రయాణంలో కృషి చేసిన ఉద్యోగులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌ఎస్టీఎల్‌ డైరెక్టర్‌ అబ్రహం వర్గీస్‌ మాట్లాడుతూ 1969 ఆగస్టు 20న కేవలం 10 మందితో ప్రారంభమైన ఎన్‌ఎస్టీఎల్‌.. అంచెలంచెలుగా అభివృద్ధి చెంది ఇప్పుడు 184 మంది శాస్త్రవేత్తలు, 662 మంది ఉద్యోగులు సేవలందిస్తోందన్నారు. జలాంతర యుద్ధ ఆయుధాలు, వ్యవస్థల అభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రక్షణ రంగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తోందన్నారు. డీఆర్‌డీవో డైరెక్టర్‌ జనరల్‌(మెటీరియల్స్‌ అండ్‌ సిస్టమ్స్‌) ఆర్‌.వి.హరప్రసాద్‌, మెటీరియల్‌ అసిస్టెంట్‌ చీఫ్‌(డాక్‌ యార్డ్‌ అండ్‌ రిఫిట్‌) రియర్‌ అడ్మిరల్‌ అరవింద్‌ రావల్‌ కూడా ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా 25 ఏళ్ల సర్వీస్‌ పూర్తి చేసుకున్న అధికారులు, సిబ్బందిని సత్కరించారు. ఉత్తమ గ్రంథాలయ వినియోగదారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే మొత్తం 40 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించారు. వరుణాస్త్ర కోసం రూపొందించిన ‘బెలూన్‌ రికవరీ సిస్టమ్‌’ సాంకేతికతను భారత్‌ డైనమిక్స్‌ లిమిటెడ్‌ సంస్థ(బీడీఎల్‌)కు బదిలీ చేశారు. డాక్టర్‌ సమీర్‌ వి.కామత్‌ చేతుల మీదుగా ఈ సాంకేతికతను బీడీఎల్‌ డైరెక్టర్‌(ప్రాజెక్ట్స్‌) పి.వి.రాజారామ్‌కు అందజేశారు. ఎన్‌ఎస్టీఎల్‌ అభివృద్ధి చేసిన జీటీ–ఐఆర్‌ఎస్‌ఎస్‌ను ఆయన రియర్‌ అడ్మిరల్‌ అరవింద్‌ రావల్‌కు అందించారు. స్వదేశీ రాడార్‌ క్రాస్‌ సెక్షన్‌ ప్రిడిక్షన్‌ సాఫ్ట్‌వేర్‌ ‘నిర్వాణ’ను కూడా విడుదల చేశారు. ఎన్‌ఎస్టీఎల్‌ హిందీ మ్యాగజైన్‌ ‘మథన్‌’ 8వ సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్‌ నాయకులు, నిర్వహణ కమిటీ సభ్యులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

తల్లి చెంతకు తప్పిపోయిన బాలికలు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ఎస్‌ఐ దివ్యభారతి

మద్రిపాలెం: ఇంటి నుంచి అదృశ్యమైన ఇద్దరు బాలికలు కంచరపాలెం పోలీసులు, ఒక మహిళ సహకారంతో క్షేమంగా తమ తల్లి చెంతకు చేరుకున్నారు. వివరాలివి. గవర కంచరపాలెంలో నివసిస్తున్న గేదెల రేఖ, ఆమె భర్త రైల్వే స్టేషన్‌లో ఒక ఫుడ్‌కోర్టులో పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి పని ముగించుకుని రేఖ ఇంటికి తిరిగి వచ్చేసరికి.. ఆమె ఇద్దరు కుమార్తెలు ఇంట్లో లేరు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ దొరకకపోవడంతో వెంటనే కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తక్షణమే స్పందించి, ఆ బాలికల వివరాలను వాట్సాప్‌ గ్రూపుల్లో షేర్‌ చేశారు. ఇదే సమయంలో ఆర్‌.పి.పేట ప్రాంతానికి చెందిన ఒక మహిళ రాత్రి సమయంలో ఆ ఇద్దరు బాలికలు రైల్వే ట్రాక్‌ సమీపంలోని ఒక జిమ్‌ ఆవరణలో సంచరించడాన్ని గమనించింది. ఇక్కడ ఎందుకు ఉన్నారని వారిని ప్రశ్నించగా.. ఇంట్లో ఫోన్‌ పోయిందని, తల్లిదండ్రులు తిడతారని భయంతో ఇంటి నుంచి బయటకు వచ్చామని వారు చెప్పారు. ఆ మహిళ వెంటనే స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తకు విషయం చెప్పింది. రాత్రి కావడంతో ఆ కార్యకర్త ఆ ఇద్దరు బాలికలను తమ ఇంట్లోనే ఉంచి, ఉదయం అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్లి సచివాలయం ఎంఎస్‌కేకు సమాచారం అందించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు.. అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకుని బాలికలను స్టేషన్‌కు తీసుకెళ్లారు. మంగళవారం ఉదయం కంచరపాలెం సీఐ రవికుమార్‌ సమక్షంలో ఆ బాలికలను వారి తల్లి రేఖకు అప్పగించారు. దీంతో ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

108 డిఫెన్స్‌ మద్యం బాటిళ్ల స్వాధీనం

ఇద్దరి అరెస్ట్‌



స్వాధీనం చేసుకున్న డిఫెన్స్‌ మద్యం సీసాలు

పెదగంట్యాడ: గాజువాక పరిసర ప్రాంతాల్లో అక్రమంగా డిఫెన్స్‌ మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. పెదగంట్యాడ కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నరసింహారెడ్డి అనే వ్యక్తి నుంచి 15 డిఫెన్స్‌ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో నరసింహారెడ్డి గాజువాక బీసీ రోడ్డులోని వెంకటేశ్వర ఫర్నిచర్‌ దుకాణం యజమాని జీలకర్ర సుబ్బారావు నుంచి మద్యం కొనుగోలు చేసినట్లు తెలిపాడు. దీంతో పోలీసులు ఆ ఫర్నిచర్‌ దుకాణంలో సోదాలు చేయగా, మొత్తం 108 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. ఈ మద్యం ఎక్కడ నుంచి వస్తోందని సుబ్బారావును ప్రశ్నించారు. నేవల్‌ అధికారులు ఫర్నిచర్‌ కొనుగోలు చేసి, అందుకు బదులుగా మద్యం సీసాలు ఇస్తారని సుబ్బారావు చెప్పాడు. ఈ కేసులో నరసింహారెడ్డి, జీలకర్ర సుబ్బారావును పోలీసులు అదుపులోకి తీసుకుని గాజువాక ఎక్సైజ్‌ పోలీస్‌ స్టేషన్‌కు అప్పగించారు. ఈ కేసుపై పూర్తి దర్యాప్తు జరుగుతోందని ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ ఆర్‌.ప్రసాద్‌ తెలిపారు.

నాకౌట్‌కు బుల్స్‌.. కింగ్స్‌ ఔట్‌

విశాఖ స్పోర్ట్స్‌: ఏపీఎల్‌ నాలుగో సీజన్‌లో భీమవరం బుల్స్‌ జట్టు నాకౌట్‌ దశకు చేరుకోగా.. కాకినాడ కింగ్స్‌ పరాజయంతో టోర్నమెంట్‌ నుంచి నిష్క్రమించింది. వైఎస్సార్‌ స్టేడియంలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో టాస్‌ ఓడి బ్యాటింగ్‌ చేసిన భీమవరం బుల్స్‌ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. రేవంత్‌ 51, శ్రవణ్‌ 58, మునీష్‌ 43 (నాటౌట్‌) పరుగులతో రాణించారు. సుదర్శన్‌, మణికంఠ చెరో రెండు వికెట్లు తీశారు. 215 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో కాకినాడ కింగ్స్‌ జట్టు విఫలమైంది. కెప్టెన్‌ భరత్‌ ఓపెనర్‌గా 76 పరుగులు చేసి పోరాడినప్పటికీ, మిగతా బ్యాటర్ల నుంచి సరైన సహకారం అందలేదు. చివరికి ఒక బంతి మిగిలి ఉండగానే కింగ్స్‌ 187 పరుగులకు ఆలౌట్‌ అయింది.

అమరావతిపై విజయవాడ విజయం : మరో మ్యాచ్‌లో టాస్‌ ఓడి తొలుత బ్యాటింగ్‌ చేసిన అమరావతి రాయల్స్‌ 138 పరుగులకు ఆలౌటైంది. సందీప్‌(53) అర్ధసెంచరీ చేశాడు. వెంకట్‌ నాలుగు వికెట్లు తీశాడు. ప్రతిగా విజయవాడ సన్‌షైనర్స్‌ 13.1 ఓవర్లలోనే కేవలం ఒకే వికెట్‌ కోల్పోయి విజయాల క్ష్యాన్నందుకుంది. ఓపెనర్‌ అభినవ్‌ (45) నాటౌట్‌గా నిలవగా కెప్టెన్‌ అశ్విన్‌ హెబ్బర్‌ 82 పరుగులు చేశాడు. కాగా.. ఆరు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, రెండు పరాజయాలు, రెండు రద్దు అయిన మ్యాచ్‌లతో కలిపి మొత్తం ఆరు పాయింట్లతో భీమవరం బుల్స్‌ నాకౌట్‌కు అర్హత సాధించింది. ఇప్పటికే అమరావతి రాయల్స్‌, తుంగభద్ర వారియర్స్‌, విజయవాడ సన్‌షైనర్స్‌ జట్లు నాకౌట్‌ దశకు చేరుకున్నాయి. కాకినాడ కింగ్స్‌, సింహాద్రి వైజాగ్‌ లయన్స్‌, రాయలసీమ రాయల్స్‌ జట్లు టోర్నమెంట్‌ నుంచి నిష్క్రమించాయి. పాయింట్ల పట్టికలో మొదటి రెండు స్థానాల్లో ఉన్న అమరావతి రాయల్స్‌, తుంగభద్ర వారియర్స్‌ మధ్య క్వాలిఫైయర్‌ మ్యాచ్‌ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. భీమవరం బుల్స్‌, విజయవాడ సన్‌షైనర్స్‌ మధ్య ఎలిమినేటర్‌ మ్యాచ్‌ జరుగుతుంది. ఎలిమినేటర్‌లో గెలిచిన జట్టు, క్వాలిఫైయర్‌లో ఓడిన జట్టుతో ఫైనల్‌ బెర్త్‌ కోసం పోటీపడుతుంది.

బీపీసీఎల్‌కు భూమి కేటాయించలేదు

విశాఖపట్నం పోర్టు ట్రస్ట్‌ కార్యదర్శి
వేణుగోపాల్‌ స్పష్టత

పెదగంట్యాడ: భారత్‌ పెట్రోలియం కార్పొరేషన్‌ లిమిటెడ్‌(బీపీసీఎల్‌)కు భూమిని కేటాయించలేదని విశాఖపట్నం పోర్టు ట్రస్ట్‌ కార్యదర్శి వేణుగోపాల్‌ స్పష్టం చేశారు. మంగళవారం 68వ వార్డు కార్పొరేటర్‌ గుడివాడ అనూష, మింది, అక్కిరెడ్డి గ్రామస్తులు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి, బీపీసీఎల్‌ కోసం భూమి కేటాయింపు గురించి ఆరా తీశారు. దీనిపై స్పందించిన కార్యదర్శి.. భూమి కేటాయింపు జరగలేదని చెప్పడంతో వారంతా వెనుదిరిగారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ అనూష మాట్లాడుతూ బీపీసీఎల్‌ భూమి కేటాయింపు విషయంపై సంయుక్త పరిశీలన చేస్తామని కార్యదర్శి చెప్పారన్నారు. అదే విధంగా ఆ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ కోసం బొటానికల్‌ గార్డెన్‌ ఏర్పాటు చేయాలని తాము కోరామన్నారు.

నేడు ఆగ్రా–ఫుడ్‌ ప్రాసెసింగ్‌ పరిశ్రమపై అవగాహన

విశాఖ సిటీ: కాన్ఫడరేషన్‌ ఆఫ్‌ వుమెన్‌ ఎంటర్‌ప్రెన్యూర్స్‌, టీమ్‌ ఇండస్ట్రీస్‌ కన్సల్టెన్సీ సర్వీసెస్‌, ఏపీ చాంబర్స్‌ ఆఫ్‌ కామర్స్‌ సంయుక్తంగా ఆగ్రో–ఫుడ్‌ ప్రాసెసింగ్‌ పరిశ్రమపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. టీమ్‌ చైర్మన్‌ డి.ఎం.రావు, ఏపీ చాంబర్స్‌ వుమెన్స్‌ వింగ్‌ చైర్‌పర్సన్‌ డాక్టర్‌ గీతా శ్రీకాంత్‌ తెలిపారు. ఎంవీపీ కాలనీ సెక్టార్‌–6లోని భద్రం కమ్యూనిటీ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

సెల్‌పాయింట్‌లో వివో ‘వీ60’ ఆవిష్కరణ



వీవో వీ60 ఫోన్‌ ఆవిష్కరిస్తున్న మేయర్‌ పీలా శ్రీనివాసరావు, సెల్‌పాయింట్‌ సీఎండీ బాలాజీ

డాబాగార్డెన్స్‌: వివో మొబైల్‌ కంపెనీ సరికొత్త ఫీచర్లతో రూపొందించిన ‘వివో వీ60’ మొబైల్‌ను మేయర్‌ పీలా శ్రీనివాసరావు మంగళవారం డాబా గార్డెన్స్‌లోని సెల్‌పాయింట్‌ షోరూంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మొదటి వివో వీ60 ఫోన్‌ను సెల్‌పాయింట్‌ కస్టమర్‌కు అందజేశారు. అనంతరం మేయర్‌ మాట్లాడుతూ భారత్‌లోనే రూపొందించిన వివో వీ60 ఫోన్‌ అధునాతన ఫీచర్లతో అన్ని సెల్‌పాయింట్‌ షోరూంలలో అందుబాటులో ఉందన్నారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సెల్‌పాయింట్‌ యాజమాన్యం తమను తాము ఎప్పటికప్పుడు ఆధునీకరించుకుంటూ.. ఖాతాదారుల నమ్మకాన్ని చూరగొంటోందని కొనియాడారు. వివో కంపెనీ ఏజీఎం ఎస్‌బీబీ సతీష్‌ మాట్లాడుతూ కొత్త వివో వీ60 ఫోన్‌ అల్ట్రా సిమ్‌, క్వాడ్‌ కర్వ్‌డ్‌ డిస్‌ప్లేతో వస్తుందని వివరించారు. సెల్‌పాయింట్‌ ఎండీ బాలాజీ పాండే, కార్పొరేటర్‌ శరగడం రాజశేఖర్‌, మాజీ కార్పొరేటర్‌ పోతు సత్యనారాయణ, సంస్థ ఏఎస్‌ఎం గోవింద్‌, షోరూం మేనేజర్‌ కొండలరావు, కస్టమర్లు పాల్గొన్నారు.

చెదిరిపోని స్మృతుల ప్రతిబింబాలే ఫొటోలు

బీచ్‌రోడ్డులో ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్‌ ప్రారంభం



ఫొటో జర్నలిస్టులతో జీవీఎంసీ కమిషనర్‌ కేతన్‌ గార్గ్‌

ఏయూక్యాంపస్‌: ఛాయా చిత్రాలు అనేక అనుభూతులను గుర్తు చేస్తాయని జీవీఎంసీ కమిషనర్‌ కేతన్‌ గార్గ్‌ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం విశాఖ మ్యూజియంలో వైజాగ్‌ ఫొటో జర్నలిస్ట్స్‌ అసోసియేషన్‌ ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నగరానికి చెందిన ఫొటో జర్నలిస్టులు తీసిన పలు ఛాయాచిత్రాలను ఆసక్తిగా తిలకించారు. ఈ ప్రదర్శన ఒక వైపు సుందర నగరాన్ని, మరో కోణంలో సమస్యలను చూపించే విధంగా ఉందన్నారు. గత ఏడాది కాలంలో జరిగిన అనేక సంఘటనలను గుర్తుచేసే విధంగా ఈ ప్రదర్శన ఉందని పేర్కొన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో ఉత్తమ జర్నలిస్టులుగా అవార్డులు సాధించిన వారిని ఈ సందర్భంగా సత్కరించారు. అనంతరం అసోసియేషన్‌ తరఫున కమిషనర్‌ను సన్మానించారు. విశాఖ మ్యూజియం అసిస్టెంట్‌ డైరెక్టర్‌ పాల్గుణరావు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనివాసరావు, జీవీఎంసీ పీఆర్‌వో నాగేశ్వర రావు, జెడ్పీ శివ ప్రసాద్‌, రాష్ట్ర ఫొటో జర్నలిస్ట్స్‌ అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు ఎల్‌.మోహన రావు, వీపీజే అసోసియేషన్‌ అధ్యక్షులు వై.రామకృష్ణ, కార్యదర్శి ఎం.డి.నవాజ్‌, కోశాధికారి ఎ.శరత్‌ కుమార్‌ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

22న జాబ్‌ మేళా

కంచరపాలెం: వివిధ సంస్థల్లో ఖాళీగా ఉన్న సుమారు 100 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నేషనల్‌ కెరీర్‌ సర్వీస్‌ సెంటర్‌(ఎన్‌సీఎస్‌సీ)లో ఈ నెల 22న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సెంటర్‌ ఉప ప్రాంతీయ అధికారి నిట్టాల శ్యామ్‌సుందర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. క్లర్క్‌, డ్రైవర్‌, ఫార్మసిస్ట్‌, ట్రైనర్‌ వంటి ఉద్యోగాలకు టెన్త్‌, ఇంటర్‌, ఐటీఐ, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణత సాధించిన 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, హైదరాబాద్‌, అనకాపల్లి, నెల్లూరు, గుంటూరు వంటి ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుంది. ఆయా ఉద్యోగాలను బట్టి వార్షిక వేతనం రూ.1.8 లక్షల నుంచి రూ. 4.8 లక్షల వరకు ఉంటుంది. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలోని ఎన్‌సీఎస్‌సీ కేంద్రానికి ఉదయం 10 గంటలకు తమ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన సూచించారు.

జీవీఎంసీ ఉద్యోగుల పదోన్నతిపై మేయర్‌ సమీక్ష

డాబాగార్డెన్స్‌: జీవీఎంసీలో జూనియర్‌ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించే అంశంపై మేయర్‌ పీలా శ్రీనివాసరావు మంగళవారం సమీక్ష నిర్వహించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో అదనపు కమిషనర్‌ డి.వి.రమణమూర్తితో కలిసి సమావేశమయ్యారు. ఐదేళ్లుగా పలు కారణాల వల్ల పదోన్నతులు నిలిచిపోయాయని, ప్రస్తుతం ఉద్యోగులతో సమన్వయం చేసుకుని వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నామని మేయర్‌ తెలిపారు. ఇప్పటికే అర్హత ఉన్న 30 మంది జూనియర్‌ అసిస్టెంట్లకు సీనియర్‌ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అర్హత కలిగిన మిగిలిన ఉద్యోగులందరికీ 2026 మార్చి నాటికి పదోన్నతులు కల్పిస్తామన్నారు.

30న జనసేన బహిరంగ సభ



మాట్లాడుతున్న పౌర సరఫరాల శాఖ మంత్రి, పీఏసీ ఛైర్మన్‌ నాదెండ్ల మనోహర్‌

సీతంపేట: కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 30న ఇందిరాగాంధీ మున్సిపల్‌ స్టేడియంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, పీఏసీ ఛైర్మన్‌ నాదెండ్ల మనోహర్‌ తెలిపారు. మంగళవారం ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధ్యక్షుడు పవన్‌ కల్యాణ్‌ నుంచి పార్టీ శ్రేణులంతా పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభ పర్యవేక్షణకు 1,400 మంది వలంటీర్లను నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ హరిప్రసాద్‌, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్‌, పంచకర్ల రమేష్‌బాబు, విజయకుమార్‌, డిప్యూటీ మేయర్‌ దల్లి గోవింద్‌ పాల్గొన్నారు.